
ఆపరేషన్
డబుల్ క్రాస్
MVS
PUBLICATIONS
మధుబాబు

# ఆపరేషన్ డబుల్ క్రాస్

రచన

మధుబాబు

*© Author*
*© Madhu Baabu*
*This digital book is published by -*

*కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.*

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

*All rights reserved.*

*No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.*

# ఆపరేషన్ డబుల్ క్రాస్

ఎర్రగా నిగ నిగమెరుస్తున్న జాగ్వార్ స్పోర్ట్స్ కారును సిమెంట్ రోడ్ మీదినుంచి క్రిందికిదింపి, ఎదురుగా కనిపిస్తున్న మట్టిరోడ్ వైపు పోనిచ్చాడు షాడో.

దట్టమైన ముళ్ళపొదలు దారుణంగా పెరిగివున్నాయి ఆ మట్టిరోడ్డుకు రెండుప్రక్కలా. కట్టెలకోసం ఆ పొదల్లోకి పోయిన గ్రామీణులు కొందరు కట్టెలు కొట్టుకోకుండానే వట్టిచేతులతో వచ్చేస్తూ జాగ్వార్‌కి ఎదురయ్యారు.

"భయ్యా... రతన్ భేలా గ్రామం యిక్కడికి ఎంతదూరం?" కారు విండోలోనుంచి తల బయటికి పెడుతూ వారిలో ఒకతన్ని పలుకరించింది బిందు.

"పాతిక మైళ్ళదూరం వుంటుందమ్మా... ఈ రోజుకు మీరు ప్రయాణం మానుకోవటం చాలామంచిది. చినుకు పడిందంటే యీ రోడ్ మీద అంగుళంకూడా కదలదు మీ కారు." అని సలహా యిచ్చి వడివడిగా అవతలికి వెళ్ళిపోయాడు ఆ గ్రామీణుడు.

ఆశ్చర్యంగా షాడో వైపు చూచింది బిందు. గ్రామీణుడి మాటల్ని వినగానే కారు డోర్ తెరుచుకొని క్రిందికి దిగాడు షాడో. కనులు చిట్లిస్తూ ఆకాశంవైపు చూశాడు.

అంతకుముందు ఒక పావుగంట వరకూ ఎంతో నిర్మలంగా వుంది ఆకాశం. కారు మబ్బులతో నిండిపోతోంది యిప్పుడది. నల్లగా కాటుక పూసినట్లు భయంకరంగా

వున్నాయవి. చూస్తుండగానే వాటి మరుగున పడిపోయాడు ఆకాశం మధ్యలో వున్న సూర్యుడు.

ఉన్నట్లుండి ఛటాలున మెరిశాయి రెండు మెరుపులు. పెళ పెళమని గర్జించింది ఆకాశం. మట్టి బెడ్డలు పడినట్లు టపటపమని శబ్దంచేస్తూ జాగ్వార్ మీద పడసాగాయి వర్షపు చినుకులు.

"ఏం చేద్దాం రాజూ ? వెనక్కి వెళ్ళిపోదామా? ఈ దిక్కుమాలిన రోడ్ మీద కారు దిగబడిపోతుందేమో!!" గ్రామీణుడి మాటల్ని గుర్తుకు తెచ్చుకుంటూ ఆందోళనగా అన్నది బిందు.

అన్నదే కాని, ఆ పని అంత తేలికగా జరిగేది కాదని ఆమెకు తెలుసు. పదిరోజులపాటు తలలు బద్దలు కొట్టుకోగా, కోగా తెలిసింది రతన్ ఖేలా గ్రామపు రహస్యం. ఆఫ్టరాల్ నాలుగు వర్షపు చినుకులకు భయపడి వెనక్కి తిరగటమా!!

ఆమె ఆలోచనలు పూర్తికాకముందే స్టీరింగ్ ముందు కూర్చుని జాగ్వార్‌ని ముందుకు పోనిచ్చాడు షాడో.

మరో రెండునిముషాలు కూడా గడువకముందే విపరీతంగా విజృంభించింది వర్షం. బ్రహ్మాండమైన యీదురు గాలి దానికితోడు అయింది. రోడ్ ప్రక్కనవున్న చెట్లు పొదలు అన్నీ తీవ్రంగాచలించి పోసాగాయి.

దృష్టినంతా రోడ్ మీద కేంద్రీకరించి సాధ్యమైనంత వేగంగా జాగ్వార్‌ని నడపడం ప్రారంభించాడు షాడో. పావుగంట తరువాత వెడల్పుగా వున్న ఒక పచ్చిక మైదానంలోకి

పోయింది వారు అనుసరిస్తున్న మట్టిరోడ్. జానెడెత్తున పెరిగివున్న పచ్చిగడ్డి తప్ప మరో చెట్టుగాని, పుట్టగాని ఆ మైదానంలో కనిపించటం లేదు. పరిగెత్తటం యిష్టంలేని పందెపు గుర్రంలా మట్టిరోడ్ మీద గతుకుల్లో ఎగిరెగిరి పడుతున్న జాగ్వార్‌ని నేర్పుగా కంట్రోల్ చేస్తున్న షాడో ముఖంమీద వెంటనే వుద్భవించాయి రెండు స్వేదబిందువులు.

ఉరుములు మెరుపులతో దద్దరిల్లే ఆకాశానికి పచ్చిక మైదానాలన్నా, వాటిలో ప్రయాణంచేసే యినుప ముక్కలన్నా మహాయిష్టం. మైదానంలోనుంచి వెంటనే బయటికి పోకపోతే కొంపలు మునగటం ఖాయం.

ఆ మాట షాడో మనస్సులో మెదులుతూ వుండగానే, చెవులు చిల్లులు పడిపోయేటట్లు కర్ణ కఠోరంగా అరిచింది బాక్ సీటులో కూర్చుని వున్న జూజీ.

ఉలిక్కిపడి దాని వైపు చూశాడు షాడో.

లెఫ్ట్ సైడ్ విండో దగ్గిర కూర్చుని ఆకాశంలోకే చూస్తోంది అది. ఉన్నట్లుండి కత్తుల్లా నిక్కబొడుచుకున్నాయి దాని శరీరం మీది రోమాలన్నీ. ఛెంగున లేచి మరింత బిగ్గిరిగా అరుస్తూ ముందు సీట్లోకి జంప్ చేసిందది.

అదిరిపడి అక్కడి కక్కడే జాగ్వార్‌ని ఆపేశాడు షాడో.

“కమాన్ బిందూ... కమాన్...” అని బిందును హెచ్చరిస్తూ డోర్ తెరుచుకొని బయటికి దూకేశాడు.

ఎందుకు ఏమిటి అని అడగలేదు బిందు. షాడో మాదిరిగానే మెరుపులా రియాక్ట్ అయిందామె. వళ్ళోవున్న హేండ్‌బేగ్‌ని అవతలికి విసిరికొట్టి దాని వెనుకే బయటికి జంప్ చేసింది.

వింటినుంచి వెలువడిన బాణంలా అనుసరించింది జూజీ. ఫుట్ బాల్ దొర్లినట్లు గునగునా పరిగెత్తుతూ బయలుదేరింది పెడ్రో.

సూటిగాపోయి, పాతిక అడుగుల దూరంలో కనిపించిన ఒక బురద గుంటలో నిలబడ్డాడు షాడో. తను కట్టుకొనివున్న బనారస్ పట్టుచీరె పాడయిపోతుందని కూడా ఆలోచించకుండా అతనితోపాటు మోకాలిలోతున్న ఆ బురదలోదిగి నిలబడింది బిందు.

ఆ మరుక్షణం కళ్ళు మిరుమిట్లు గొలిపేటట్లు మెరిసింది ఒక మెరుపు. దిక్కులు బద్దలై పోతున్నట్లు గర్జించింది ఆకాశం. గుండెలు అదిరేటట్లు శబ్దంచేస్తూ సూటిగావచ్చి జాగ్వార్ మీద పడింది ఒక పిడుగు.

ఆ సమయంలో వెలువడిన శబ్దాన్ని భరించలేక చెవుల్ని గట్టిగా మూసుకొని, తలలు వంచుకున్నారు షాడో బిందులు. తిరిగివాళ్ళు తలలు ఎత్తేసరికి అంతా అయిపోయింది. రెండు క్షణాల ముందువరకూ అరబ్బీ జాతి రేసు గుర్రంలా మిల మిలలాడుతూ కనిపించిన వారి జాగ్వార్ స్పోర్ట్స్ కారు యిప్పుడు పాతరేకుల వోటిడబ్బామాదిరి తయారైపోయింది.

మరో రెండు క్షణాలపాటు తాము ఆ కారులోనే వుండి వుంటే...

ఆ మాట అనుకొనే సరికి అంత వర్షంలోనూ చెమటలు పట్టాయి బిందు అరిచేతులు.

"థాంక్యూ వెరీమచ్ జూజీ. నీ ఋణం ఎలా తీర్చుకోగలమో అర్థం కావటం లేదు" అంటూ ముందుకు వంగి, తమకాళ్ళ ముందు నిలబడివున్న జూజీ తలను ముద్దుపెట్టుకొంది.

ముంచుకు వస్తున్న ప్రమాదాలను ముందుగానే పసికట్టగల శక్తి సమురాయ్ హంటింగ్ డాగ్స్ కి వుంటుందని షాడోకి తెలుసు. ఆ జాతిలోనే పుట్టిన జూజీ ఆకాశంలో నుండి పడుతున్న పిడుగును కూడా ముందుగానే పసికట్టగలదని గ్రహించే సరికి షాడో ఆశ్చర్యానికి అంతులేకుండా పోయింది

"ఫెంటాస్టిక్ జూజి డార్లింగ్. రియల్లీ యువార్ గ్రేట్."అంటూ జూజీ తలనిమిరి బురదగుంటలో నుంచి బయటికి అడుగువేశాడు.

అంతే. అంతవరకు , అతని వంకా, బిందు వంకా మార్చి మార్చి చూస్తోంది పెడ్రో. అతను అడుగు కదిపిన మరుక్షణం ఇంతలావున నోరుతెరిచి భూతంలా అరిచింది. అంతటితో ఆగకుండా బురలోపడి నడుములు విరిగినట్లు గిలగిలా కొట్టుకోవడం మొదలెట్టింది.

చటుక్కున నాలుక కొరుక్కుని నెత్తిమీద అరచేత్తో చరుచుకున్నాడు షాడో. జూజీకి పుట్టిన ఒక్కగానొక్క బిడ్డ ఆ పెడ్రో. పుట్టుటంతోనే తల్లి గుణాలన్నిటినీ పుణికి పుచ్చుకుంది. అవి సరిపోనట్లు యింత ఉడుకుమోతుతనాన్ని కూడా ఎక్కడి నుంచో నేర్చుకు వచ్చింది. తన ఎదుట తల్లిని అలా మెచ్చుకొని, తనవంక చూడనుకూడా చూడకపోతే ఎందుకు వూరుకుంటుంది అది?

"నువ్వు ఆగు రాజూ... దీని పాడుబుద్ది రోజురోజుకూ తగ్గటం పోయి ఎక్కువ అయిపోతుంది. ఎంతసేపు అలా తన్నుకుంటుందో చూద్దాం... నువ్వు కొంచెం ఆగు..." అంటూ పెడ్రో తల నిమరబోతున్న షాడోని వారించింది బిందు.

ఆ మాటలు అర్ధం అయ్యాయి కాబోలు... కర్ణ కఠోరంగా అరిచి, మరింత వేగంగా కొట్టుకోవటం ప్రారంభించింది పెడ్రో.

నవ్వుతూ దాన్ని బురదలోనుంచి పైకి ఎత్తి తల నిమిరాడు షాడో.

"ఇట్సాల్ రైట్ పెడ్రో....నువ్వు పక్కన వుండబట్టే గదరా.... జూజీ అసలు ఆ పిడుగును పసికట్ట కలిగింది. నువ్వు లేకపోయినట్టయితే మా పని, జూజీ పని ఆఖరే..." అంటూ నెత్తిమీద ఒక మొట్టికాయివేసి బురదగుంట బయట వదిలాడు.

ఠీవిగా తలతిప్పి బిందువైపు చూసింది పెడ్రో.

పైకి వుబుకుతున్న నవ్వును బలవంతంగా అదుముకుంది బిందు. నవ్వితే దానికి మళ్ళీ ఉక్రోషం వుప్పొంగి వస్తుందని ఆమెకు తెలుసు.

ఎందుకూ పనికిరాకుండా పోయిన జాగ్వార్ వంక ఒకసారి చూసి మెల్లిగా మైదానం చివరిభాగం వైపు అడుగులువేశాడు షాడో. కాలంకాని కాలంలోవచ్చి, అందమైన పట్టుచీరను పాడుచేసినందుకు కురుస్తున్న వర్షాన్ని నిందిస్తూ మెల్లిగా అతన్ని అనుసరించింది బిందు.

ఉరుములతో మెరుపులతో దద్దరిల్లి పోతూనే వుంది ఆకాశం. కుండపోతగా కురుస్తూనే వుంది వర్షం. పచ్చిక మైదానాన్నిదాటి మళ్ళీ ముళ్ళపొదల మధ్యగా ప్రయాణం చేశారు వారిద్దరూ. అలా పదిమైళ్ళదూరం పోయేసరికి అయిపోయింది బిందు పని.

"ఈ పాడు బురదలో నేనిక నడువలేను బాబూ... కాసేపు ఆగిపోదాం." అంటూ బురదతో నిండివున్న బండరాయిమీద అలాగే బాసిపట్టు వేసుకు కూర్చుంది.

సగం తడిసిపోయిన పనామా సిగరెట్‌ని జాగ్రత్తగా బయటికి తీసి, అది పూర్తిగా తడిసిపోకుండా మరింత జాగ్రత్త పడుతూ, లైటర్‌తో వెలిగించుకోవటానికి విశ్వప్రయత్నం చేస్తున్న షాడో, తలతిప్పి చుట్టూవున్న ముళ్ళపొదల్ని జాగ్రత్తగా పరికించాడు.

సి.ఐ. బి. హెడ్‌క్వార్టర్స్‌లో చూసి వచ్చిన మాప్‌లన్నీ గిర్రున తిరిగాయి అతని కనులముందు. ఆ చుట్టు పక్కలే ఎక్కడో వుండాలి – ఒక పురాతన ఆలయం ఎప్పుడో అస్సాం రాష్ట్రాన్ని హిందూ చక్రవర్తులు పరిపాలించిన కాలంలో కట్టబడిన కాళీయమ్మ ఆలయం అది.

నవరాత్రి వుత్సవాల సమయంలో దాని చుట్టుపట్ల వున్న గ్రామాలనుంచి తండోప తండాలుగా వచ్చి పూజలు చేసిపోతారు గ్రామీణులు. మిగిలిన రోజుల్లో అక్కడ దీపారాధనకూడా జరుగదు.

నవరాత్రి వుత్సవాలు జరిగే సమయమే అది... దుర్గాష్టమి యింకో రెండురోజులే వుంది...

ఆ మాట అనుకుంటుండగానే గాలివాలున అతనికి వినిపించింది బలంగా మ్రోగిస్తున్న డప్పుల మోత. ఆ శబ్దాన్ని వినగానే అప్రయత్నంగా అతని పెదవులమీద ప్రత్యక్షం అయింది చిన్న చిరునవ్వు.

"కమాన్ బిందూ... కూర్చోవటానికి మంచి చోటు ఒకటి నాకు తెలుసు. ఊరికే కూర్చోవటమే కాదు. కాళీయమ్మకు నైవేద్యం పెట్టిన కుడుములు, వడపప్పుకూడా ఆరగించవచ్చు... కమాన్." అంటూ బిందును లేవదీసి, నడుముచుట్టూ చేయి చుట్టి పొదల మధ్యకు దారితీశాడు.

అతను వూహించినట్లే మూడు ఫర్లాంగుల అవతల చిన్నమట్టి దిబ్బమీద వారికి కనిపించింది కాళీయమ్మ ఆలయం. జోరుగా కురుస్తున్న వర్షాన్ని కూడా లెక్కచేయకుండా పూజలు చేయటానికి అక్కడ గుమికూడి వున్నారు అనేకమంది గ్రామీణులు.

తడిసిపోయిన శరీరాలతో, బురద నిండిన దుస్తులతో ప్రత్యక్షం అయిన షాడో బిందుల్ని సాదరంగా ఆహ్వానించాడు వారిలో ఒకతను. ఇన్ని కుడుములు, పట్టెడు వడపప్పు, రెండు మట్టి ముంతలనిండా పానకం యిచ్చి మెల్లగా పలకరించాడు.

"రతన్ భేలా గ్రామంలో బంధువులున్నారు బాబాయ్. చూసి పోవటానికి వచ్చాం దారిలో కారు చెడిపోయింది." అంటూ తమ కష్టాలకు కారణాన్ని చెప్పింది బిందు.

"అయ్యయ్యో...ఎంత అవస్థ వచ్చింది తల్లీ... వర్షం తగ్గగానే వెళ్ళిపోదురు గాని, మా యింటికి రండి... యిక్కడికి నాలుగు మైళ్ళే మా గ్రామం..." వెంటనే సానుభూతిగా అన్నాడతను.

అతనికి కనిపించకుండా తలతిప్పి ప్రశ్నార్థకంగా షాడోవైపు చూసింది బిందు.

"వద్దులే బిందూ....ఎలాగైనా సరే యీ రాత్రికి మనం రతన్ ఖేలా వెళ్ళిపోవాలి... వర్షం తగ్గేదాకా కూర్చుందాం..." అన్నాడు షాడో.

ఆ మాటల్ని వినేసరికి గ్రామీణుడి ముఖంలో ఎందుకో విపరీతమైన ఆందోళన పొడచూపింది. అటూ యిటూ చూసి గొంతు తగ్గిస్తూ, "చూడమ్మా... పెద్దవాణ్ణి కాబట్టి మీ మేలుకోరి చెపుతున్నాను. నా యింటికి రావటం యిష్టం లేక పోతే లేకపోయింది. యిక్కడినుంచి మాత్రం చీకటి పడకముందే వెళ్ళిపొండి. ఎట్టి పరిస్థితుల్లోను చీకటి పడిన తరువాత యిక్కడ వుండద్దు." అన్నాడతను.

"అదేమిటి బాబాయ్? ఉంటే ఏమౌతుంది??" ఆశ్చర్యంగా అడిగింది బిందు.

ఇంకా కొంచెం ముందుకు జరిగి మరింతగా గొంతు తగ్గించాడు ఆ గ్రామీణుడు.

"చూడు బేటీ.... ఈ కాళీయమ్మ ఆషామాషీ దేవత కాదు. మహా వుగ్రదేవత. చీకటి పడగానే తన భూతగణాలనన్నిటినీ వెంటబెట్టుకొని సంచారానికి బయలు దేరుతుంది. ఆ సమయంలో ఆమెను చూసిన వారందరూ గుండెపగిలి చచ్చిపోతారు. నెలరోజుల క్రితం మా పక్క గ్రామం కుర్రాళ్ళు నలుగురు యిలాగే చెప్పినమాట వినకుండా చీకటిపడిన

తరువాత యిక్కడికి వచ్చి చచ్చిపోయారు... మీకు కూడా అదే గతి పట్టకుండా వుండాలంటే నా మాట విని వెంటనే మాతో పాటు బయలుదేరండి." అని రెండు క్షణాలపాటు వారి సమాధానంకోసం ఎదురు చూశాడతను.

అటువంటి కట్టు కథల్ని తాము నమ్మదలచుకోలేదని అతని ముఖంమీదే చెప్పటానికి సంకోచిస్తూ మౌనం వహించింది బిందు.

వాళ్ళు తనమాట వినరని గ్రహించాడు కాబోలు, మారు మాటాడకుండా మరో పట్టెడు కుడుముల్ని తీసి వారి ముందు పెట్టి అవతలికి పోయాడు ఆ గ్రామీణుడు.

కాళీయమ్మకు పూజలు అయిపోయాయి. తట్టల్ని బుట్టల్నీ సర్దుకొని గుంపులు గుంపులుగా తమ గ్రామానికి తిరుగు ముఖం పట్టారు అక్కడవున్న వారందరూ. వాళ్ళు కనుచూపు మేరదాటి పోయేదాకా ఆగి, గ్రామీణుడు యిచ్చిన కుడుముల్లో సగం తీసి జూజీ ముందు పెట్టింది బిందు.

కుడుముల్ని చూసిన క్షణంనుంచీ పెడ్రో నోరు మహా వూరిపోతోంది. తొందరపడితే మొట్టికాయలు తినాల్సి వస్తుందన్న భయంతో, తన కోరికను అతి ప్రయత్నం మీద అదుము కొని, గోతికాడి నక్కలా కూర్చుని వున్నదది! తల్లిముందు కుడుములు పడిన మరుక్షణం ఎగిరి ముందుకు దూకి వాటి అంతు చూడటం మొదలుపెట్టింది.

"రాను రాను యిది వట్టి తిండిపోతుగా తయారయిపోతోంది రాజూ... దీన్ని గారాబం చేసి నువ్వే చెడగొడుతున్నావ్...ఇంకా కొన్ని రోజులు పోతే యిది వూరకుక్క అవుతుంది... " అంటూ దాని నెత్తిమీద ఒక మొట్టికాయ వేసి, జూజీకి వేరే పెట్టింది బిందు.

*అదే సమయంలో వంచిన తలను ఎత్తకుండా కుదుముల అంతు చూస్తున్న పెడ్రో వున్నట్లుండి వెనక్కి దూకి కర్ణ కఠోరంగా అరిచింది.*

*ఛెంగున లేచి దాని ప్రక్కకు పోయింది జూజీ. కత్తుల్లా లేచి నిలబడ్డాయి దాని మెడమీది రోమాలు.*

*"అయ్యబాబోయ్... ముందు ఆ పిల్ల భూతాన్ని తల్లి భూతాన్ని రెండింటినీ కాస్త గట్టిగా పట్టుకో గురూ... మీదపడి పీకాయంటే బొడ్డుచుట్టూ యింజక్షన్లు చేయించుకోలేక చావాలి..." అంటూ చేతులెత్తి పొదల చాటునుంచి యివతలికి వచ్చాడు శ్రీకర్.*

*పెడ్రో అరిచిన మరుక్షణం అప్రయత్నంగా కుడికాలి బూటుమీద పడింది షాడో చేయి. ఆ బూటుకు అడ్డంగా అమర్చివుంది తళ తళమెరిసే ఆరంగుళాల డాగర్. దాని పిడిని పట్టుకొని బయటికి లాగబోతూ శ్రీకర్‌ని చూడగానే నవ్వుతూ బిందువైపు తిరిగాడు.*

*పెడ్రో వంక ఆప్యాయంగా చూస్తోంది బిందు. దానికి ఉడుకుమోతుతనం ఎక్కువ అన్నమాట నిజమే. తిండిమీద ఆశకూడా ఎక్కువే... ఆ దుర్గుణాలన్నిటితో పాటు జూజీని మించిన తెలివితేటలు కూడా వున్నాయి... పొదల్లో వున్న శ్రీకర్‌ని జూజీ కంటె ముందుగానే పసికట్టింది అది...*

*బిందు ఆలోచనలేవీ పెడ్రోకి తెలియవు. శ్రీకర్ ని చూడగానే దాని సంతోషానికి అంతు లేకుండా పోయింది. తోకను నిటారుగా ఎత్తి నేలకు కొట్టిన రబ్బర్ బంతిలా గంతులువేస్తూ పోయి అతనిమీదికి దూకింది.*

**End of Preview.**

**Rest of the book can be read @**

http://kinige.com/kbook.php?id=455